# ప్రజల మనిషికే.. మా మద్దతు

*నగరంలో బీఆర్ఎస్ పార్టీకి రోజు రోజుకూ వివిధ వర్గాల మద్దతుతో పాటు విభిన్న రంగాల వారి సమ్మతం పెరుగుతున్నది. నగర వ్యాప్తంగా పలు నియోజకవర్గాల నుంచి బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. అన్ని వర్గాలు, రంగాల వారిని కలుపుకుపోతూ మద్దతును కూడగట్టుకుంటున్నారు. కార్మికులు, క్యాబ్ డ్రైవర్స్, యువత, ఇంకా పలు వర్గాల నేతలు, ప్రజలు పని చేసే బీఆర్ఎస్ పార్టీకే తమ మద్దతు అని, ప్రజా సమస్యలు పట్టించుకునే సీఎం కేసీఆర్ ప్రజల మనిషి అని, కేసీఆరే ముచ్చటగా మూడోసారి తమ ముఖ్యమంత్రి అని ప్రకటిస్తున్నారు. నగరం అంతటా గులాబీ పార్టీకి జనం నుంచి అమోఘమైన మద్దతు లభిస్తున్నది. బీఆర్ఎస్ పార్టీ మరోసారి పాలనలోకి రావడం ఖాయమని అభిమాన జనం భజాయించి చెబుతున్నారు.*



బండారిని సత్కరిస్తున్న కార్మిక నేతలు

- కార్మికులకు భరోసా అయి.. సమస్యలు తీరుస్తా
- ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి
- మల్లాపూర్‌లో కార్మికుల ఆత్మీయ సమ్మేళనం
- భారత ట్రేడ్ యూనియన్ అనుబంధ సంఘాల ఏకగ్రీవ తీర్మానం

ఉప్పల్, నవంబర్ 14: ఉప్పల్ నియోజకవర్గ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, వైస్ ప్రెసిడెంట్ హమాలి శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి మాట్లాడుతూ కార్మికులకు భరోసాగా నిలిచిన సీఎం కేసీఆర్‌కు ప్రతి ఒక్కరు అండగా ఉండాలన్నారు. కార్మికులకు అత్యధికంగా జీతాలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే అని చాటి చెప్పారు. కేసీఆర్ పాలనలో కార్మికులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్మికులతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, కార్మికులను తన ట్రస్టు ద్వారా నిత్యం ఆదుకుంటూ సేవలు చేస్తున్నామని మరో మారు గుర్తు చేశారు. ఎవరికి సమస్యలు వచ్చినా తాను ముందుంటానని, భరోసాగా నిలుస్తానని ఉద్ఘాటించారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం పాటుపడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే టికెట్ రాక ముందు నుంచే పనులు చేస్తున్నానని, అవకాశం ఇస్తే ప్రజలకు సేవకుడిగా నిరంతరం సేవలు అందిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను అమలు చేస్తామని, ప్రతి పక్షాల మోసపూరిత హామీలు నమ్మవద్దన్నారు. కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామన్నారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ల అనుబంధ సంఘాలు ఏకగ్రీవ తీర్మానం చేస్తూ, బండారికి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు తీర్మాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటరు ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, కార్మిక నాయకులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## పద్మారావు గౌడ్‌కే రైల్వే కార్మికుల మద్దతు

*రైల్వే మజ్దూర్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో నేతలతో సమావేశం*



సికింద్రాబాద్‌లో రైల్వే సంఘం నేతలతో సమావేశమైన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తదితరులు

సికింద్రాబాద్, నవంబర్ 14: డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ మంగళవారం రైల్వే ప్రధాన కార్మిక సంఘాల్లో ఒకటైన సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యునియన్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. యూనియన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, జాతీయ రైల్వే కార్మికుల ఫెడరేషన్ నేత సీహెచ్ శంకర్ రావుతో సమావేశమయ్యారు. శంకర్‌రావుతో పాటు యునియన్ కేంద్ర కమిటీ నేతలు కూడా పాల్గొన్న ఈ సమావేశంలో పద్మారావు గౌడ్ మాట్లాడారు. రైల్వే కార్మికులకు అనుకూలంగా తమ విధానాలు ఉన్నందున ఎన్నికల్లో తమకే మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే కార్మికులు, ఉద్యోగులు అధికంగా నివసించే సికింద్రాబాద్‌లోని వివిధ రైల్వే కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని గతంలో వివిధ సందర్భాల్లో రైల్వే జీఎంలు, కేంద్ర రైల్వే మంత్రులపై ఒత్తిడి తెచ్చామని, అదే విధంగా రైల్వే ఆసుపత్రిలో కొవిడ్ వైద్య సేవలను అందించేందుకు, వ్యాక్సిన్ కేంద్రం ఏర్పాటుకు తామే చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైల్వే సిబ్బంది సమస్యల పట్ల తమకు సంపూర్ణ అవగాహన ఉందని, సికింద్రాబాద్‌లో రైల్వే సిబ్బందికి తామే అండగా నిలుస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కూడా రైల్వే కార్మికుల సమస్యల పట్ల సానుకూలత ఉందని తెలిపారు. ఎన్నికల్లో తమకే మద్దతు తెలపాలన్న పద్మారావు గౌడ్ అభ్యర్థనకు కార్మిక సంఘం నేత శంకర్ రావుతో పాటు నేతలు సానుకూలంగా స్పందించారు.

## మెకానిక్‌లు కష్ట జీవులు.. వారికి అండగా ఉంటాం

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- ఎల్బీనగర్‌లో టూ వీలర్ మెకానిక్స్, ఆటోమొబైల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం



ఎల్బీనగర్‌లో టూ వీలర్ మెకానిక్స్, ఆటోమొబైల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటించి సన్మానిస్తున్న దృశ్యం

ఎల్బీనగర్, నవంబర్ 14: మెకానిక్‌లు కష్టజీవులని, వారికి అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్‌లో టూ వీలర్ మెకానిక్స్, ఆటోమొబైల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోమొబైల్ అసోసియేషన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అసోసియేషన్‌కు సమావేశం కోసం స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఎల్బీనగర్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆటోమొబైల్ వెల్ఫేర్ అసోసియేషన్ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి నరేందర్ యాదవ్‌లు మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ట్రాఫిక్ చిక్కులను తొలగించి సిగ్నల్ ఫ్రీ ప్రయాణానికి ఏర్పాట్లు చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి, కేసీఆర్ ప్రభుత్వానికి తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. అర్హులైన తమ మెకానిక్‌లు, కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ఆటోమొబైల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు జగన్ గౌడ్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌తో పాటుగా పెద్ద ఎత్తున్న మెకానిక్‌లు, కార్మికులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ వెంటే.. ప్రజలు

- మేయర్ జక్క వెంకట్‌రెడ్డి
- మంత్రి మల్లారెడ్డికి నాయి బ్రాహ్మణ సంఘం మద్దతు
- పీర్జాదిగూడలో ఏకగ్రీవ తీర్మానం



మంత్రి మల్లారెడ్డికి మేయర్ జక్క వెంకటరెడ్డి సమక్షంలో మద్దతు ప్రకటించిన నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, కుల పెద్దలు

పీర్జాదిగూడ, నవంబర్ 14: మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డికి విశేష ఆదరణ లభిస్తుంది. పలు కుల సంఘాలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వార్షిక సమావేశంలో స్థానిక మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ పోచయ్య పాల్గొన్నారు. ఈ సమావేంలో సంఘం కమిటీ సభ్యులందరూ మేయర్ సమక్షంలో బీఆర్ఎస్ అభ్యర్థికి మల్లారెడ్డికి పూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం, మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను మెచ్చే కుల సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించడం హర్షణీయమన్నారు. మంత్రి మల్లారెడ్డి భారీ మెజారిటీతో విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఎన్.శ్రీనివాస్, రాయిగిరి యాదగిరి, పయ్యాల వీరస్వామి, కుల పెద్దలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

### ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 14: సమాజంలోని సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేశానని, ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావుకు మూసాపేట మార్వాడీ సంఘం నేతలు మంగళవారం సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బతుకుదెరువు కోసం వివిధ ప్రాంతాల నుంచి కూకట్‌పల్లికి వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎల్లవేళలా అండగా ఉండి ఆదుకున్నానన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమప్రాధాన్యత లభించిందని, ఏ వర్గాన్ని ఇబ్బంది పెట్టలేదన్నారు. నగరంలో ప్రజలంతా కలిసిమెలిసి జీవించడం వల్లే నగరం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణాన్ని కాపాడుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సంఘటితమై బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్, జనసేన నేతలు ఎన్నికల్లో గెలిచేందుకు మాయమాటలు చెబుతున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, మార్వాడీ సంఘం నేతలున్నారు.



ఎమ్మెల్యే కృష్ణారావుకు మద్దతు పలికిన మూసాపేట మార్వాడీ సంఘం నేతలు

## బీఆర్ఎస్‌కే.. మైనార్టీల మద్దతు

*మాగంటిని కలిసిన మజీదు కమిటీ సభ్యులు*

బంజారాహిల్స్, నవంబర్ 14: జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు మైనార్టీ మత పెద్దలు, మజీదు కమిటీ సభ్యులు జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌ను కలిసి తమ సంఘీభావం ప్రకటించారు. మైనార్టీల సంక్షేమం అనేక పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్ఎస్‌కు రానున్న ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని మాగంటి గోపీనాథ్ కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మైనార్టీ మత పెద్దలు రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కచ్చితంగా మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మజీదు కమిటీ సభ్యులు పాషా ఖాన్, వాజిద్, సత్తార్. బాబు, మోయిజ్, గౌస్, పాషాతో పాటు స్థానిక మైనార్టీ నేతలు నజీర్, షరీఫ్. జావెద్, ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.